స్టాక్ పాయింట్ పరిశీలన

పరిశీలిస్తున్న విజయకుమార్

ఇచ్ఛాపురం: ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన విద్యా కానుక స్టాక్ పాయింట్‌ని డిప్యూటీ డిఇఒ విజయకుమారి శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లా కేంద్రం నుంచి మండల కేంద్రాలకు వస్తున్న పాఠ్యపుస్తకాలు ఇచ్చిన లెక్క ప్రకారం సక్రమంగా ఉన్నది, లేనిది పరిశీలించుకోవాలని సూచించారు. విద్యా కానుక స్టాక్ పాయింట్‌లో తరగతుల వారీగా పార్టీ పుస్తకాలను విడివిడిగా ఉంచుకొనే ఏర్పాట్లు చేసుకోవాలన్నా రు. వాటికి పూర్తిభద్రత కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో విద్యాశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

కౌంటింగ్ ఫీవర్

- ఎక్కడ చూసినా ఓట్ల లెక్కింపు పైనే చర్చ
- ఏర్పాట్లలో తలమునకలవుతున్న అధికార యంత్రాంగం
- రోజులు దగ్గర పడుతుండటంతో అభ్యర్థుల్లో మొదలైన టెన్షన్
- విహారయాత్రల్లో సేదదీరుతున్న వైనం

కౌంటింగ్‌కు కౌంట్ డౌన్ మొదలైంది. ఓట్ల లెక్కింపునకు మరో పది రోజులు మాత్రమే ఉంది. దీంతో అధికార యంత్రాంగం ఓట్ల లెక్కింపునకు విస్తృత ఏర్పాట్లు చేస్తోంది. మరోవైపు జిల్లాలో దాదాపు అన్నిచోట్లా బెట్టింగ్‌లు జోరుగా సాగుతున్నాయి. గెలుపోటములపై ఇంకా తీవ్ర చర్చోపచర్చలు జరుగుతున్నాయి. గ్రామాల్లో నాయకుల ఇళ్ల వద్ద పార్టీల వారీగా కూర్చొని లెక్కలు వేసుకుంటున్నారు. సోషల్ మీడియాలో వస్తున్న సర్వేలపై చర్చించుకుంటున్నారు. కొంతమంది నాయకులు ఎమ్మెల్యే అభ్యర్థుల ఇళ్లకు వెళ్లి ఎడతెరిపిలేని చర్చలు జరుపుతున్నారు. లెక్కలు తేలక తలలు పట్టుకుంటూ జూన్ నాలుగు ఎప్పుడు వస్తుందా? అని క్షణమొక యుగంలా గడుపుతున్నారు. ఈ టెన్షన్ నుంచి ఉపశమనం కోసం విహార యాత్రలకు వెళ్లారు.

ప్రజాశక్తి- శ్రీకాకుళం ప్రతినిధి

ఫలితాలు వచ్చేస్తున్నాయి. ప్రజాతీర్పునకు రోజులు దగ్గరపడుతున్నాయి. దీంతో అధికారులు లెక్కింపు ఏర్పాట్లలో తలమునకలయ్యారు. ఇంకా అభ్యర్థులు, అనుచరులు కూడికలు, తీసివేతల్లో ఉన్నారు. ఎవరికి వారే అంచనాలు వేసుకుంటూ తమదే పైచేయి అంటూ పైకి మేకపోతు గాంభీర్యం ప్రదర్శిస్తున్నా లోలోపల భయం మాత్రం వెంటాడుతోంది. ఈ నెల 13న జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో పోలైన ఓట్లను జూన్ నాలుగో తేదీన లెక్కించనున్నాయి. ఎచ్చెర్లలోని శ్రీశివానీ ఇంజినీరింగ్ కళాశాలలో ఓట్ల లెక్కింపు చేపట్టనున్న సంగతి తెలిసిందే. ఈవిఎంలను కట్టుదిట్టమైన మూడంచెల భద్రత మధ్య స్ట్రాంగ్ రూమ్‌లో ఉంచారు. కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్, ఎస్‌పి జి.ఆర్.రాధిక ఎప్పటికప్పుడు స్ట్రాంగ్ రూమ్‌లను పరిశీలిస్తున్నారు. ఓట్ల లెక్కింపు ఏర్పాట్లలో అధికారులు తలమునకలయ్యారు ఓట్ల లెక్కింపు సందర్భంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్ అధికారులకు దిశానిర్ధేశం చేస్తున్నారు. కౌంటింగ్ రోజు తీసుకోవాల్సిన భద్రతా చర్యలపై ఎస్‌పి రాధిక పోలీసు అధికారులతో సమీక్ష సమావేశాలు నిర్వహిస్తున్నారు.

కాయ్ రాజా కాయ్

ఎన్నికల్లో గెలుపోటములపై జిల్లాలో జోరుగా పందేలు కొనసాగుతున్నాయి. శ్రీకాకుళం, ఆమదావలస నియోజకవర్గాల్లో ఎక్కువ బెట్టింగ్‌లు జరగుతున్నట్లు సమాచారం. ముఖ్యంగా టిడిపి మద్దతుదారులు బెట్టింగ్‌లో ముందున్నట్లు తెలుస్తోంది. పలానా నియోజకవర్గంలో తమ పార్టీయే గెలుస్తుందంటూ ప్రత్యర్థి పార్టీకి సవాల్ విసురుతున్న పరిస్థితి నెలకొంది. ఇచ్ఛాపురం నియోజకవర్గంలో విడివిడిగా, గ్రూపులుగా ఏర్పడి డబ్బులు పందెంగా పెడుతున్నట్లు సమాచారం. తమకు నచ్చిన అభ్యర్థి గెలుపు కోసం రూ.25 వేలు నుంచి రూ.లక్ష వరకు బెట్టింగ్‌కు దిగుతున్నట్లు తెలుస్తోంది. టెక్కలిలో రూ.5 నుంచి రూ.50 వేలు వరకు పందేలు జరగుతున్నట్లు సమాచారం. ఇందులో టిడిపి అభ్యర్థి అచ్చెన్నాయుడే గెలుస్తారని ఎక్కువ మంది బెట్టింగ్‌కు దిగుతున్నట్లు తెలిసింది. ఆమదాలవలసలో వైసిపి గెలిస్తే ఒకటికి రెండు రెట్లు సొమ్ము ఇస్తామంటూ పందెం రాయుళ్లు ఆఫర్ చేస్తున్నట్లు తెలుస్తోంది. శ్రీకాకుళం నియోజకవర్గంలోనూ జోరుగా బెట్టింగ్‌లు కొనసాగుతున్నాయి. టిడిపి అభ్యర్థి గొండు శంకర్ గెలవరని గుండ మద్దతుదారులు కొంతమంది పందెం కాస్తున్నట్లు తెలుస్తోంది. ధర్మాన గెలుస్తారని కొంత మంది... శంకర్‌దే విజయమని మరికొందరు బెట్టింగ్ చేస్తునట్లు సమాచారం.

కేరళలోని వాయినాడ్ విహార యాత్రలో ఉన్న దువ్వాడ శ్రీనివాస్



గోవా బీచ్‌లో విహార యాత్రలో ఉన్న కూన రవికుమార్

విహారయాత్రల్లో అభ్యర్థులు

పోలింగ్‌కు, కౌంటింగ్‌కు చాలా సమయం ఉండటంతో చాలా మంది అభ్యర్థులు విహారయాత్రలకు వెళ్లినట్లు తెలుస్తోంది. గెలుపోటముల టెన్షన్ తట్టుకోలేక కుటుంబ సభ్యులతో కలిసి వేర్వేరు ప్రాంతాలకు వెళ్లి సేదదీరుతున్నట్లు తెలిసింది. శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం సిమ్లా టూర్ వెళ్లినట్లు తెలిసింది. ఆమదాలవలస టిడిపి అభ్యర్థి కూన రవికుమార్ గోవా టూర్‌కు వెళ్లినట్లు సమాచారం. ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ చెన్నయ్‌లోని మధురై, కేరళలోని వాయినాడ్ పర్యటనకు వెళ్లినట్లు తెలుస్తోంది. పాతపట్నం టిడిపి అభ్యర్థి మామిడి గోవిందరావు షిరిడి పర్యటనకు వెళ్లారు. వైసిపి అభ్యర్థి రెడ్డి శాంతి ఢిల్లీలో ఉన్నారు. పలాస టిడిపి అభ్యర్థి గౌతు శిరీష విశాఖలో ఉన్నారు. శ్రీకాకుళం నియోజకవర్గ వైసిపి అభ్యర్థి మంత్రి ధర్మాన ప్రసాదరావు వైద్య పరీక్షల కోసం హైదరాబాద్, టిడిపి అభ్యర్థి గొండు శంకర్ బెంగుళూరు వెళ్లినట్లు తెలిసింది. ఎచ్చెర్ల వైసిపి అభ్యర్థి గొర్లె కిరణ్‌కుమార్, కూటమి అభ్యర్థి ఎన్.ఈశ్వరరావు కూడా నియోజకవర్గంలో ఉండి గెలుపుపోటములపై లెక్కలు వేసుకుంటున్నారు. నరసన్నపేటలో వైసిపి, టిడిపి అభ్యర్థులు ధర్మాన కృష్ణదాస్, బగ్గు రమణమూర్తిలు నియోజకవర్గంలో ఉండి తమను కలవడానికి వచ్చిన అనుచరులు, నాయకులతో ఫలితాలపై చర్చలు జరుపుతున్నారు. ఇచ్ఛాపురం టిడిపి అభ్యర్థి బెందాళం అశోక్ నియోజకవర్గంలో ఉన్నారు. తనను కలవడానికి వస్తున్న ముఖ్యనాయకులు, అనుచరులతో తమకు వచ్చే ఓట్లను లెక్క గడుతూ వారితో గడుపుతున్నారు.

కౌంటింగ్‌పై అవగాహన అవసరం

జిల్లా ఎన్నికల అధికారి మనజీర్ జిలానీ సమూన్

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

మాట్లాడుతున్న జిల్లా ఎన్నిక అధికారి మనజీర్ జిలానీ సమూన్

కౌంటింగ్ ప్రక్రియపై సంపూర్ణ అవగాహన, పట్టు కలిగి ఉండాలని జిల్లా ఎన్నికల అధికారి మనజీర్ జిలాని సమూన్ తెలిపారు. సార్వత్రిక ఎన్నికలు-2024లో భాగంగా వచ్చే నెల 4న జరగనున్న ఓట్ల లెక్కింపునకు అనుసరించాల్సిన మార్గదర్శకాలు, విధి విధానాలపై నగరంలోని అంబేద్కర్ ఆడిటోరియంలో కౌంటింగ్ సూపర్ వైజర్లు, మైక్రో అబ్జర్వర్లు, కౌంటింగ్ అసిస్టెంట్లు తదితర సిబ్బందికి శుక్రవారం శిక్షణ ఇచ్చారు. ఎన్నికలు విజయవంతంగా నిర్వహించడంలో కృషి చేసిన అధికారులను అభినందించారు. అదే స్ఫూర్తితో కౌంటింగ్ విజయవంతం చేయాలన్నారు. కచ్చితమైన, సమర్థవంతమైన ఓట్ల లెక్కింపునకు అవసరమైన జ్ఞానం, నైపుణ్యాలతో సిబ్బందిని సన్నద్ధం చేయడం ఈ శిక్షణ ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల (ఈవిఎంలు) లెక్కింపు కంటే ముందుగా 'పోస్టల్ బ్యాలెట్ పేపర్ల' లెక్కింపు జరుగుతుందని, కౌంటింగ్ రోజు జరిగే సంఘటనల క్రమాన్ని వివరించారు. అందుకు తగ్గట్టుగా ఈ ప్రక్రియ కోసం సమగ్రంగా సన్నద్ధం కావాలన్నారు. రాజకీయ పార్టీల ఏజెంట్లకు నమ్మకం కలిగించే వరకూ ఓపికగా ఉండాలన్నారు. కౌంటింగ్ పూర్తి అయ్యేంతవరకు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా పూర్తి పారదర్శకంగా వ్యవహరించాలన్నారు. మాస్టర్ ట్రైనర్లు కౌంటింగ్ ప్రక్రియ అవగాహన కల్పించారు. జిల్లా రెవెన్యూ అధికారి ఎం.గణపతి రావు, మాస్టర్ ట్రైనర్లు కిరణ్, ఎన్.బాలాజీ, మెప్మా పీడీ కిరణ్‌కుమార్, శేష గిరి, జిల్లా వ్యాప్తంగా 350 మంది వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

'కాయల' మంత్రం ఫలించేనా?

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

ఎన్నికల బరిలో దిగిన వైసిపి ఈసారి ఐప్యాక్ దూత కాయల వెంకటరెడ్డి మంత్రాంగం పోల్‌మేనేజ్‌మెంట్ వల్ల గట్టెక్కుతుందా? అనే సందేహం పార్టీ వర్గాల్లో చర్చనీయాంశమైంది. గతం కంటే ఎక్కువ శాతం ఓట్లు పోల్ కావడం, ఇందులో మహిళా ఓటింగ్ శాతం భారీగా పెరగడంతో వైసిపి శ్రేణుల్లో కొత్త ఉత్సాహం వచ్చింది. కచ్చితంగా ఈసారి ఇచ్ఛాపురంలో వైసిపి జెండా ఎగురవేయడం తథ్యమని అంటున్నారు. ఇదే సమయంలో ఈసారి ఎన్నికలో నూతన ఒరవడి పార్టీ అమలులోకి తెచ్చింది. ఈసారి ఎన్నికలో జిల్లాలో రెండు ప్రధాన నియోజకవర్గాలు ఇచ్ఛాపురం, టెక్కలిపై పార్టీ అధిష్టానం దృష్టి పెట్టింది. అందులో భాగంగానే ఈ రెండు నియోజకవర్గాల పోల్‌మేనేజ్ మెంట్ బాధ్యత, పార్టీ నేతలు మధ్య ఉన్న గ్యాప్‌ను సరిదిద్ది సమిష్టిగా కృషి చేసేందుకు వెంకటరెడ్డి గట్టి ప్రయత్నాలు చేశారు. అదే సమయంలో ఇచ్ఛాపురం వైసిపి అభ్యర్థికి పోల్‌మేనేజ్‌మెంట్‌లో పూర్తి స్వేచ్ఛ లేకపోవడం, ఐప్యాక్ సూచనలు మేరకు ఓటర్లు, పార్టీ క్యాడర్‌ను నడిపించడం కొంత విమర్శలకు దారితీసింది. ఓటర్ల ప్రలోభాలు పెట్టేందుకు చేసిన అన్ని ప్రయత్నాలు విజయవంతం కాలేదని చెబుతున్నారు. ఈ నియోజకవర్గంలో ఎవ్వరు ఎలాంటి వ్యక్తులు వారి బలాబలాలు, బలహీనతలు పూర్తి అవగాహన ఉన్న అభ్యర్థికి చాలా విషయాల్లో పూర్తి స్వేచ్ఛ లేకపోవడం కొంతమేర నష్టం కలిగించే అవకాశం కనిపిస్తోందని పార్టీ వర్గాలు బహిరంగంగా ఆరోపిస్తున్నారు. ఇచ్ఛాపురం చరిత్రలో ఎప్పుడు ఎన్నికలు జరిగినా అనాధికరింగా రూ.పది కోట్లు వరకు ఖర్చులు ఉండేవి. కానీ, ఈసారి అధికార పార్టీ దాదాపు రూ.30 కోట్లు వరకు వరకు అనధికారికంగా ఖర్చు అయ్యినట్లు రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. ఇంత భారీస్థాయిలో రూ.కోట్లు కుమ్మరించినా గెలుపుపై గ్యారెంటీ లేకుండాపోయిందని గుసగుసలాడుకుంటున్నారు. అధికార పార్టీ అంతా స్థాయిలో ఖర్చు చేస్తే... దానిలో అర్ధ భాగం ప్రతి పక్ష పార్టీ ఖర్చు చేసి ఉంటుంది. జిల్లాకు శివారు ప్రాంతమైన ఇచ్ఛాపురం లాంటి ప్రాంతంలో ఎన్నికలకు రూ.కోట్లు ఖర్చుపెడితే, సామాన్య వ్యక్తులు ఎవ్వరూ పోటీ చేయాలన్నా భయపడే స్థితి వచ్చింది. సార్వత్రిక ఎన్నికల్లో రూ.కోట్లు ఖర్చు పెట్టిన పార్టీలు, తర్వాత జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో మరింతా భారంగా మారే అవకాశాలు మెండుగా ఉన్నాయి. ఈ స్థాయిలో ఖర్చు పెట్టగలిగే నేతలకే అవకాశాలు మెండుగా ఉంటుంది. గ్యారెంటీ లేని పెట్టుబడికి జూన్ 4న ప్రజలు ఎలాంటి తీర్పు ఇస్తారో? అని నియోజకవర్గం ప్రజానీకం ఉత్కంఠతో ఎదురుచూస్తున్నారు.

కౌంటింగ్‌కు పటిష్ట ఏర్పాట్లు

ఎస్‌పి జి.ఆర్ రాధిక

ప్రజాశక్తి- శ్రీకాకుళం

జూన్ 4న ఎచ్చెర్ల మండలం చిలకపాలెంలోని శివాని ఇంజినీర్ కళాశాల స్ట్రాంగ్ రూమ్‌లో జరగనున్న సార్వత్రిక ఎన్నికల ఓట్లు లెక్కింపు ప్రక్రియకు పటిష్ట భద్రత ఏర్పాట్లు ఉండాలని ఎస్‌పి జి.ఆర్.రాధిక పోలీసు అధికారుల ను ఆదేశించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో ఓట్లు కౌంటింగ్ నిర్వహణ, కౌంటింగ్ రోజున తీసుకోవలసిన చర్యలు, భద్రత, బందోబస్తు ఏర్పాట్లపై డిఎస్‌పిలు, సిఐలతో శుక్రవారం సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఓట్లు కౌంటింగ్ నిర్వహించే శివాని ఇంజినీరింగ్ కళాశాలల వద్ద ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా కేంద్ర బలగాలు, జిల్లా ఆర్మ్డ్ రిజర్వ్, సివిల్ పోలీసులతో మూడంచెల బందోబస్తు, భద్రత ఏర్పాట్లు చేపడుతున్నామని అన్నారు. ఎన్నికల కౌంటింగ్ కేంద్రాల వద్ద ఎటువంటి అల్లర్లు జరగకుండా పోలీసు అధికారులు, సిబ్బంది నిర్వహించాల్సిన విధులు, చేపట్టాల్సిన భద్రత చర్యలపై దిశానిర్దేశం చేశారు. కౌంటింగ్ కేంద్రాల వద్ద ట్రాఫిక్ రెగ్యులేషన్, వాహనాల పార్కింగ్‌కు ప్రత్యేకంగా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. 144 సెక్షన్ ప్రకారం కౌంటింగ్ కేంద్రాల వద్ద ప్రజలు గుమిగూడకుండా చూడాలన్నారు. కౌంటింగ్ కేంద్రాలకు విచ్చేసే వివిధ పార్టీలకు చెందిన కౌంటింగ్ ఏజంట్లు, వాహనాలను కౌంటింగ్ కేంద్రాల వద్ద ప్రత్యేకంగా నిర్దేశించిన పార్కింగ్ ప్రాంతాలకు తరలించాలన్నారు. వాహనదారులు ఇబ్బందులు పడకుండా సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకొని, కాషనరీ బోర్డులను ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. కౌంటింగ్ కేంద్రాలలోకి వెళ్లే ఏజంట్లను క్షుణ్ణంగా తనిఖీ చేయాలన్నారు. రిటర్నింగ్ అధికారి జారీ చేసిన అనుమతి పత్రాలను క్షుణ్ణంగా పరిశీలించిన తరువాత మాత్రమే కౌంటింగ్ కేంద్రాల్లోకి అనుమతించాలన్నారు.

రిటర్నింగ్ అధికారులు, కౌంటింగ్ సూపర్‌వైజర్లు మినహా మిగిలిన వారి మొబైల్స్‌ను కౌంటింగ్ కేంద్రాల్లోకి అనుమతించ వద్దన్నారు. ఫలితాలు వెల్లడైన తరువాత జిల్లాలో ఎటువంటి అల్లర్లు చెలరేగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. పెట్రోలింగ్ నిర్వహించాలని, ముందుగా గుర్తించిన ప్రాంతాల్లో పికెట్లు ఏర్పాటు చేసి నిఘా పెట్టాలని ఆదేశించారు. ఇప్పటికే గుర్తించిన ట్రబుల్ మాంగర్స్‌లకు నోటీసులు ఇవ్వాలన్నారు. విజయ ర్యాలీలు, బాణసంచ పేలులకు ఎటువంటి అనుమతులు లేవన్నారు. శాంతియుతంగా ఎన్నికల కౌంటింగ్ పూర్తయ్యేలాగా అధికారులు సిబ్బంది అందరూ సమన్వయంతో పనిచేయాలన్నారు. సమావేశంలో అదనపు ఎస్‌పిలు జి.ప్రేమ్‌కాజల్, వి.ఉమమహేశ్వరరావు, డిఎస్‌పిలు బాలచంద్రారెడ్డి, శృతి, త్రినాథరావు, నాగేశ్వరరెడ్డి, శ్రీనివాసరావు, విజయ కుమార్, సిఐలు తదితరులు పాల్గొన్నారు.

నేడు డిప్యూటీ ఎడ్యుకేషనల్ ఆఫీసర్ పరీక్ష

- హాజరు కానున్న 830 అభ్యర్థులు
- నాలుగు కేంద్రాల్లో ఆన్‌లైన్ పరీక్ష
- ఉదయం 8.30 లోపు హాజరు తప్పనిసరి
- ఏర్పాట్లను సమీక్షించిన డిఆర్‌ఒ గణపతిరావు

సమీక్షిస్తున్న డిఆర్‌ఒ గణపతిరావు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ఎపిపిఎస్‌సి ఆధ్వర్యాన డిప్యూటీ ఎడ్యుకేషనల్ ఆఫీసర్ ఇన్ ఎపి ఎడ్యుకేషనల్ సర్వీసెస్ ఉద్యోగాలకు ఈ నెల 25న జిల్లాలో పరీక్ష నిర్వహిస్తున్నట్లు జిల్లా రెవెన్యూ అధికారి ఎం.గణపతిరావు అన్నారు. కలెక్టరేట్‌లో అధికారులతో శుక్రవారం సమీక్షించారు. జిల్లాలో ఎచ్చెర్ల మండలం చిలకపాలెం జంక్షన్ శివాని ఇంజినీరింగ్ కళాశాల, వెంకటేశ్వర ఇంజినీరింగ్ కళాశాల, నరసన్నపేట మారుతీ నగర్ గొట్టేపల్లి కోర్ టెక్నాలజీస్, టెక్కలి కె.కొత్తూరు ఆదిత్య ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కేంద్రాల్లో నిర్వహిస్తున్నామని అన్నారు. జిల్లాలో 830 మంది అభ్యర్థులు ఎపిపిఎస్‌సి పరీక్షకు హాజరు కానున్నారని తెలిపారు. వీరి కోసం పై కళాశాలల్లో పరీక్షా కేంద్రాన్ని ఏర్పాటు చేశామన్నారు. ఉదయం 9 నుంచి 11.30 గంటల వరకు పరీక్ష జరుగుతుందన్నారు. ఉదయం 7.30 నుంచి పరీక్షా కేంద్రంలోకి అనుమతి ఉంటుందన్నారు. ఉదయం 8.30 గంటల తర్వాత అభ్యర్థులకు పరీక్షా కేంద్రాల్లోకి అనుమతి లేదని స్పష్టం చేశారు. పరీక్షకు హాజరయ్యే జిల్లాలోని అభ్యర్థులు ఈ విషయాన్ని గమనించాలని సూచించారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేయాలని అన్నారు. సమీపంలోని జెరాక్స్, నెట్ సెంటర్లను మూసి వేయించాలని తహశీల్దార్లకు ఆదేశించారు. పరీక్షా కేంద్రాలకు సెల్‌ఫోన్లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలు అనుమతించబడవన్నారు. విద్యుత్ అంతరాయం లేకుండా ఎపిఇపిడిసిఎల్ చూడాలన్నారు. వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయ ప్రతినిధులకు ఆదేశించారు. సమావేశంలో సెక్షన్ ఆఫీసర్ ఎం.బాలరాజు, సహాయ సెక్షన్ ఆఫీసర్ పి.పద్మప్రియా, జిల్లా పౌర సంబంధాల అధికారి కె.బాలమాం సింగ్, లావేరు, ఎచ్చెర్ల, నరసన్నపేట, టెక్కలి తహశీల్దార్లు, ఎస్‌పి కార్యాలయ ప్రతినిధి ఎస్ఐ నారాయణరావు, హెచ్ సెక్షన్ సూపరింటెండెంట్ క్రాంతి తదితరులు పాల్గొన్నారు.

పలాసలో భారీ చోరీ

40 తులాల బంగారం, రూ.18 వేల నగదు అపహరణ

ప్రజాశక్తి- పలాస

పరిశీలిస్తున్న క్లూస్ టీమ్

కాశీబుగ్గ రోటరీ నగర్, పలాస ఐటిఐ రోడ్డు సమీపంలో నివాసం ఉంటున్న పలాస ఎన్‌ఆర్‌ఇజిఎస్ కార్యాలయంలో పనిచేస్తున్న టెక్నికల్ అసిస్టెంట్ చాప అలివేణి ఇంట్లో గురువారం అర్ధరాత్రి భారీ చోరీ జరిగింది. ఈ చోరీలో 40 తులాల బంగారం ఆభరణాలు, రూ.18 వేలు నగదును దొంగలు అపహరించారు. బాధితురాలు, కాశీబుగ్గ పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. అలివేణి తన విధుల్లో భాగంగా గురువారం మండలంలోని అమలకుడియా ప్రాంతంలో విధులు నిర్వహిస్తూ... తన కన్నవారు నందిగాం మండలం హరిదాసుపురానికి వెళ్లారు. అలాగే ఆమె ఇంటి ఎదురుగా ఉన్న వారూ ఇంటికి తాళం వేసి వేరే ప్రాంతానికి వెళ్లారు. అయితే ఇంటి ఎదురుగా ఉన్న వారు శుక్రవారం ఉదయం ఇంటికి వచ్చే సరికి అలివేణి ఇంటి తలుపులు తీసి ఉండడం చూసి స్థానికులు ఆమెకు సమాచారం అందించారు. హుటాహుటిన అలవేణి ఇంటికి వచ్చి చూశారు. ఇంటికి వేసిన రెండు తాళాలు, బీరువా పగల కొట్టి బీరువాలో ఉన్న 40 తులాల బంగారం ఆభరణాలు, వెండి వస్తువులు, రూ.18 వేలు నగదును అపహరించినట్లు గుర్తించారు. ఈ విషయాన్ని కాశీబుగ్గ పోలీసులకు సమాచారం అందించారు. అలివేణి ఉపాధి హామీ పథకంలో టెక్నికల్ అసిస్టెంట్‌గా పని చేస్తూండగా, భర్త శ్రీనివాసరావు సిఆర్‌పిఎఫ్‌లో పనిచేస్తున్నారు. అర్ధరాత్రి దాటిన తరువాత దొంగలు ఇంటికి తాళం వేసిన విషయాన్ని గుర్తించి తాళాలు చాకచక్యంగా పగలుగొట్టారు. అనంతరం ఇంట్లోకి ప్రవేశించి బెడ్ రూమ్‌లోని బీరుతా తాళాలు వెతికి పట్టుకున్నారు. అనంతరం ఆ తాళాలతోనే బీరువా తెరిచి అందులో ఉన్న బంగారం, నగదు దొంగిలించి ఉడాయించారు. సుమారు గంట పాటు ఇంట్లో చక్కబెట్టినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. సంఘటన స్థలానికి ఎస్ఐ పారినాయుడు, క్లూస్ టీమ్‌తో చేరుకొని వివరాలు తెలుసుకున్నారు. మొత్తం వేలి ముద్రలు సేకరించారు. చుట్టు పక్కల సిసి కెమెరాలను పరిశీలించారు. దొంగతనం జరిగిన ఇంటికి వంద అడుగుల దూరంలో ఓ సిసి కెమెరా ఉన్నట్లు గుర్తించి అందులో నిర్లిప్తమైన సమాచారాన్ని సేకరిస్తున్నారు. ఇదిలాఉంగా దొంగతనం జరిగిన ఇంటికి ఎదురుగా నివాసం ఉన్న వారూ ఎవరూ లేని విషయాన్ని దొంగలు గుర్తించి తాళాలు పగలు కొట్టేందుకు ప్రయత్నం చేసిన విఫలయత్నం చేశారు. అయితే చుట్టు పక్కల అలికిడి కావడంతో దొంగలు ఉడాయించినట్లు అనుమానిస్తున్నారు. లేకుంటే ఆ ఇంటినీ దొంగలు కన్నం వేసేవారని పోలీసులు చెబుతున్నారు. రాత్రులు రోటరీనగర్, ఐటిఐ రోడ్డులో నిర్మానుష్యంగా ఉంటుంది. ఈ కారణంగానే దొంగతనం చేయడానికి సులువైందనే అనుమానాలు స్థానికులు వ్యక్తం చేస్తున్నారు. బాధితురాలు అలివేణి ఇచ్చిన పిర్యాదు మేరకు ఎస్ఐ పారినాయుడు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అంకితభావంతో పనిచేయాలి

గ్రామీణాభివృద్ధి జాయింట్ కమిషనర్ శివప్రసాద్

మాట్లాడుతున్న శివప్రసాద్

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ఉపాధి హామీలో ప్రతి ఉద్యోగీ అంకితభావంతో పనిచేయాలని గ్రామీణాభివృద్ధి శాఖ జాయింట్ కమిషనర్ ఎం.శివప్రసాద్ అన్నారు. నగరంలోని డిఆర్‌డిఎ సమావేశ మందిరంలో జిల్లాలోని ఎపిడిలు, ఎపిఒలు, ఇసిలు, టిఎలతో శుక్రవారం సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జాబ్‌కార్డు ఉన్న కూలీందరికీ ఉపాధి పనులు కల్పించాలన్నారు. ఖర్చు చేసిన ప్రతి పైసా పూర్తిస్థాయిలో సద్వినియోగమయ్యేలా సిబ్బంది ప్రత్యేక దృష్టిని సారించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. చెరువుల్లో, కాలువల్లో పూడికతీత పనులకు ప్రాధాన్యతను తగ్గించి భూగర్భ జలమట్టాన్ని పెంపొందింపజేయాలన్నారు. కందకాలు, ఫారం పాండ్, సరిహద్దు కందకాలు, వృత్తాకార కందకాలు, రూఫ్ వాటర్ హార్వెస్టింగ్ వంటి ఇతర పనులకు అధిక ప్రాధాన్యతను ఇవ్వాలన్నారు. చెరువుల్లో మెరక భాగాల్లో ఫిష్ పాండ్‌ల పనులు చేపట్టడం ద్వారా కూలీలకు అధిక ఉపాధి పనిదినాలు కల్పించడంతోపాటు ఆయా పంచాయతీలకు అదనపు ఆదాయం సమకూరుతుందని అన్నారు. ఈ పనులు చేపట్టడం వల్ల వచ్చే ప్రయోజనాలపై రైతులకు క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాలని ఉద్యోగులకు సూచించారు. చెరువుల్లో పూడికతీత పనులను ప్రణాళికాబద్ధంగా చేపట్టాలని, ఇందుకు అవసరమైన మార్గదర్శకాలను ఇప్పటికే జారీ చేశామని స్పష్టం చేశారు. కూలీలకు కొలతల మేరకు పనులు చేపట్టడంపై సాంకేతిక సలహాలను ఇవ్వడం ద్వారా గరిష్ట కూలి అందేవిధంగా సిబ్బంది విధులు నిర్వహించాలన్నారు. సిబ్బందికి సాంకేతిక అంశాలపై అవగాహన కల్పించారు. అంతకుముందు రణస్థలం, లావేరు, ఎచ్చెర్ల మండలాల్లో పర్యటించారు. ప్లాంటేషన్, చెరువు పూడికతీత పనులు, ఫారం పాండ్ తదితర పనులను జాయింట్ కమిషనర్ పరిశీలించి సిబ్బందికి అవసరమైన సూచనలు, సలహాలు ఇచ్చారు. సమావేశంలో జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ జి.వి.చిట్టిరాజు, ఫైనాన్స్ మేనేజర్ స్వరూపరాణి, విజిలెన్స్ అధికారి బి.లవరాజు, ఎపిడిలు పి.రాధ, మురళీకృష్ణ, శైలజ, లోకేష్, కార్యాలయ సూపరింటెండెంట్ మురళీధర్ పాల్గొన్నారు.

అథ్లెటిక్ క్రీడాకారులకు ప్రోత్సాహం

మాట్లాడుతున్న మధుసూదనరావు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

జిల్లాలో అథ్లెటిక్స్ క్రీడాకారులకు తగిన ప్రోత్సాహం అందించాలని జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ తీర్మానించింది. ఈ ఏడాది జిల్లాలో రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలను నిర్వహించాలని నిర్ణయించింది. ఈ మేరకు జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ హాల్లో అధ్యక్షుడు కొన్న మధుసూదనరావు అధ్యక్షతన జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ సర్వసభ్య శుక్రవారం నిర్వహించారు. సమావేశంలో కార్యదర్శి ఎం.సాంబమూర్తి, రాష్ట్ర అథ్లెటిక్స్ అసోసియేషన్ సంయుక్త కార్యదర్శి నౌపడ విజయ్‌కుమార్, జిల్లా అసోసియేషన్ ఉపాధ్యక్షులు కామయ్య మాస్టార్, గోపి మాస్టర్లతో పాటు ఇతర కార్యవర్గ సభ్యులు హాజరయ్యారు. జిల్లాలో అథ్లెటిక్స్ పరంగా క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ఏ విధమైన చర్యలు తీసుకోవాలన్న దానిపై ప్రధానంగా సభ్యులు చర్చించారు. అవకాశం వస్తే ఈ ఏడాది రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలు జిల్లాలో నిర్వహించాలని ఆలోచన చేశారు. ఈ విషయాన్ని రాష్ట్ర అసోసియేషన్ దృష్టికి తీసుకువెళ్లి ఇక్కడ పోటీలను నిర్వహించి స్థానిక క్రీడాకారులలో జోష్ నింపాలని నిర్ణయించారు. అవకాశం ఉన్నచోట్ల అథ్లెటిక్స్ క్రీడాకారులకు శిక్షణ ఇవ్వాలని తీర్మానించారు. క్రీడలపై ఆసక్తి ఉండేవారిని గుర్తించి అథ్లెటిక్స్ రంగంలో వారు రాణించేలా తగిన ప్రోత్సాహం అందించాలని చర్చించారు. జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశంలో ప్రధానంగా చర్చించిన అంశాలను అధ్యక్ష, కార్యదర్శులు కొన్న మధుసూదనరావు, ఎం.సాంబమూర్తిలు వివరించారు. సమావేశంలో లీగల్ అడ్వయిజర్ నౌపడ విజయ్ కుమార్, పిఇటి సంఘ నాయకులు రమణ, కార్యవర్గ సభ్యులు, సీనియర్ వ్యాయామ ఉపాధ్యాయులు, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వైద్యాధికారులతో మాట్లాడుతున్న డిఎంహెచ్ఒ మీనాక్షి

మెరుగైన వైద్యం అందించాలి

డిఎంహెచ్ఒ మీనాక్షి

ప్రజాశక్తి- ఆమదాలవలస

ఎండ తీవ్రతతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న రోగులకు అందించే వైద్యసేవలపై ప్రభుత్వ వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి బొడ్డేపల్లి మీనాక్షి అన్నారు. శుక్రవారం సరుబుజ్జిలి ఆరోగ్య కేంద్రంలో ఆమె ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారులు, సిబ్బంది హాజరుపట్టికలను, అందుబాటులో ఉన్న మందుల రికార్డులను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాలకు చెందిన ప్రజలు ప్రస్తుతం ఎండలో ఉంటూ ఉపాధి పనులు చేస్తున్నారని అటువంటి వారికి అవసరమైన అన్ని రకాల వైద్య సేవలు అందించడానికి వైద్య సిబ్బంది అందుబాటులో ఉంటూ సకాలంలో వైద్యసేవలు అందే విధంగా చర్యలు తీసుకోవాలని ఆమె సిబ్బందికి సూచించారు. అలాగే అత్యవసరమైన మందులను ఆరోగ్య కేంద్రంలో ఉండేటట్లు ఎప్పటికప్పుడు ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని ఆమె వైద్యాధికారులకు సూచించారు. కార్యక్రమంలో వైద్యాధికారులు సంతోష్ కుమార్, సాహితీ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

స్పాట్ రెమ్యూనరేషన్ చెల్లించేదెప్పుడు?

ప్రజాశక్తి- టెక్కలి

పదో తరగతి పరీక్షల జవాబుపత్రాలు మూల్యాంకన చేపట్టిన ఉపాధ్యాయులకు విద్యాశాఖ నుంచి చెల్లించాల్సిన స్పాట్ రెమ్యూనరేషన్ చెల్లింపులో జరుగుతుంది. దీంతో మూల్యాంకనం చేపట్టిన ఉపాధ్యాయులు ఆసహనం వ్యక్తం చేస్తున్నారు. పదో తరగతి జవాబుపత్రాలు మూల్యాంకన చేపట్టి సుమారు నెల రోజులు అవుతుంది. ఇంతవరకు రెమ్యునరేషన్ చెల్లించకపోవడం సమంజసం కాదంటున్నారు. పెరిగిన నూతన డిఎ ప్రకారం స్పాట్ పూర్తయిన వారం రోజుల్లో ఉపాధ్యాయులకు రెమ్యూనిరేషన్ చెల్లించాల్సి ఉంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించాలని కోరుతున్నారు.

హ్యూమన్ రైట్స్ ఆర్గనైజేషన్ సెక్రటరీగా చిన్నారావు

చిన్నారావు

కోటబొమ్మాళి: ఆంధ్రప్రదేశ్ హ్యూమన్ రైట్స్ ఆర్గనైజేషన్ సెక్రటరీగా చింతాడ చిన్నారావును హ్యూమన్ రైట్స్ ఆర్గనైజేషన్ అల్ఇండియా నేషనల్ ప్రెసిడెంట్, ఫౌండర్ బి.అయ్యప్ప, నేషనల్ వైఎస్ ప్రెసిడెంట్ ఇన్వెస్టిగేషన్ పోర్ట్ మెంబర్ లఖినేని శ్రీధర్, నేషనల్ ఇన్వెస్టిగేషన్ పోర్ట్ మెంబర్ పి.హరీష్‌లు నియమిస్తూ... శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. చిన్నారావు వారికి కృతజ్ఞతులు తెలియజేశారు. చిన్నారావు నియామకంపై బిఎస్‌పి జిల్లా అధ్యక్షుడు బోకర నారాయణరావు, కాంగ్రెస్ రాష్ట్ర పరిశీలకులు చింతాడ దిలీప్, సంతబొమ్మాళి జెడ్‌పిటిసి పాల వసంతరెడ్డి, ఎంపిపి మేరుగు అప్పారావు, ఎఎంసి చైర్మన్ రామిరెడ్డి, సర్పంచ్ చింతాడ శ్రీనివాస్‌లు అభినందనలు తెలిపారు.

అవగాహన కల్పిస్తున్న సుదర్శన్ దొర

కౌంటింగ్ సిబ్బందికి అవగాహన

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

జూన్ 4న నిర్వహించనున్న సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్‌పై అవగాహన ఉండాలని రిటర్నింగ్ అధికారి సుదర్శన్‌దొర అన్నారు. తహశీల్దార్ కార్యాలయంలో నాలుగు మండలాల తహశీల్దార్లకు, డిటిలకు, ఎంపిడిఒలకు, మున్సిపల్ కమిషనర్‌కు, ఆర్‌ఎల్‌ఎస్‌లకు, ఆఫీస్ సిబ్బందితో శుక్రవారం అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ మేరకు సిబ్బంది తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు.

'పది' పరీక్షకు 70 మంది గైర్హాజరు

టెక్కలి : స్థానిక ప్రభుత్వ జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల్లో శుక్రవారం నుంచి ప్రారంభమైన పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షకు 70 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. టెక్కలి, నందిగాం, సంతబొమ్మాళి, మెళియాపుట్టి మండలాల నుంచి 119 మంది విద్యార్థులు మాజరు కావాల్సి ఉంది. వీరిలో ఏడుగురు ఒరియా మీడియం విద్యార్థులు పూర్తిగా గైర్హాజరు కావడం విశేషం. మెదటి రోజు పరీక్ష సజావుగా ప్రారంభం కావడంపై నిర్వాహకులు సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కేంద్రానికి చీఫ్ సూపరింటెండెంట్‌గా ఉత్తరకవాటం గణపతిరావు వ్యవహరించారు. డిపార్ట్‌మెంటల్ ఆధికారిగా బమ్మిడి శేషగిరిరావు వ్యవహరించారు.

శిక్షణ పొందుతున్న క్రీడాకారులు

తైక్వాండో విద్యార్థులకు శిక్షణ

ప్రజాశక్తి- టెక్కలి

టెక్కలి ఎన్‌టిఆర్ క్రీడా వికాస్ కేంద్రం ఆధ్వర్యాన శిక్షణ పొందుతున్న తైక్వాండో క్రీడాకారులకు సిఆర్‌పి విధానంపై శుక్రవారం శిక్షణ ఇచ్చామని కోచ్, క్రీడాశాఖాధికారి కల్లేపల్లి శ్రీధర్, నర్సిపురం శేఖర్ తెలిపారు. శిక్షణలో భాగంగా గుండెపోటు వచ్చిన వ్యక్తిని ఎలా రక్షించుకోవాలనే అంశంపై ప్రాథమిక వైద్యం అందించడం వంటి విషయాలపై అవగాహన కల్పించామన్నారు. ఈ శిక్షణలో సీనియర్ క్రీడాకారులు బొడ్డ గేయామృత, కోనారి గోపి, రొనగల హసిని, ఆరంగి సాగర్, గణేష్ పాల్గొన్నారు.

'108' తనిఖీ

పాతపట్నం: పాతపట్నం ప్రభుత్వ సామాజిక ఆస్పత్రికి సంబంధించిన 108 అంబులెన్స్ వాహనాన్ని పలాస డివిజనల్ అధికారి జి.జగన్ శుక్రవారం ఆకస్మిక తనిఖీ చేశారు. వాహనంలోని అత్యవసర సమయంలో వినియోగించే పరికరాల పనితీరును, సంబంధిత రికార్డులను పరిశీలించారు. మెడికల్ ఎక్విప్మెంట్ పనితీరు, ఎమర్జెన్సీ డ్రగ్ రికార్డ్, డ్యూటీ షార్ట్‌ను పరిశీలించారు. సిబ్బంది మరింత బాధ్యతగా సేవలను అందించి సూచించారు. కార్యక్రమంలో ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్ కె.ఆఫీస్, వాహన పైలట్ సిహెచ్.చిన్న పాల్గొన్నారు.

రికార్డులను పరిశీలిస్తున్న జగన్

పైకి గాంభీర్యం.. లోలోపల భయం

గెలుపుపై ఎవరి అంచనాలు వారివే

ప్రజాశక్తి- బూర్జ

సార్వత్రిక ఎన్నికలు ముగిసిన తర్వాత అభ్యర్థులకు గుబులు పట్టుకుంది. ఓట్ల లెక్కింపునకు కొద్దిరోజులే గడువు ఉండడంతో టిడిపి కూటమి, వైసిపి నాయకులు ఎవరి అంచనాల్లో వారున్నారు. ఇరు పార్టీల నేతలు గెలుపు మాదంటే మాదని గాంభీర్యం ప్రదర్శిస్తున్నారు. అయిన ప్పటికీ వారిలో భయం వెంటాడుతుంది. పైకి మాత్రం కనీసం ఐదు నుంచి పదివేల మెజార్టీతో గెలుస్తామని ధీమా వ్యక్తం చేస్తున్నారు. అంతర్గతంగా మాత్రం కనీసం 5వేలలోపు అయినా గెలవలేక పోతామా! అనుకుంటూ లెక్కలు వేస్తున్నారు.

ఎవరి లెక్కలు వారివే

ఆమదాలవలస నియోజకవర్గానికి సంబంధించి ఎన్నికలు ఎంతో ప్రతిష్టాత్మకంగా జరిగాయి. ముఖ్యంగా ఈ నియోజకవర్గంలో వైసిపి అభ్యర్థిగా స్పీకర్ తమ్మినేని సీతారాం బరిలో ఉన్నారు. అలాగే టిడిపి మాజీ విప్ కూన రవికుమార్ టిడిపి అభ్యర్థిగా బరిలో నిలిచారు. దీంతో ఈ ప్రాంతంలో వీరితో పాటు నాయకులకు సైతం ఉత్కంఠకు నెలకొల్పింది. ఈ ప్రాంతంలో పోలింగ్‌కు ముందు ప్రచారం అందరిని సమన్వయం చేసుకోవడంలో ఊపిరి సలపకుండా గడిపారు. తర్వాత నియోజవర్గంలోని నాలుగు మండలాల్లో వార్డుల వారీగా, పంచాయతీలు వారిగా ఆయా బూత్‌ల్లో ఎంత పోలింగ్ శాతమైంది. ఎన్ని ఓట్లు వస్తాయని లెక్కలు వేసుకుంటున్నారు. బరిలో నిలిచిన నేతలే కాదు వారి అనుచర గణం కూడా ఎవరు గెలుస్తారని మాటలతో ప్రారంభమై, ఎంత మెజార్టీ అని చర్చలు జరుపు కుంటున్నారు.

పెరిగిన పోలింగ్ అనుకూలమేనా!

ఆమదాలవలస నియోజకవర్గంలో 2019కి మించి 2024లో అదనంగా పోలింగ్ నమోదైంది. 2019లో 73.10 శాతం పోలింగ్ కాగా తాజాగా 2024లో 73.54 శాతం మించి ఓట్లు పోలయ్యాయి. దీంతో ప్రధాన పార్టీలు అత్యధికంగా ఓట్లు తమకే నమోదు అవుతాయని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఈ నియోజకవర్గంలో 1,57,848 మంది ఓటర్లు తమ ఓటుహక్కు వినియోగించుకోగా అందులో మహిళలు 79, 330 మందికాగా, పురుషులు 78,515 మంది తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వంపై ఉన్న వ్యతిరేకతతోనే భారీగా పోలింగ్ జరిగిందని గెలుపుపై కూటమి అభ్యర్థి కూన రవికుమార్ ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఎన్నడు లేని విధంగా ఈ ఎన్నికల్లో యువత, ఉద్యోగులు, మహిళలు అత్యధికంగా తమ ఓట్లను వేశారని చెప్తున్నారు. వైసిపి వర్గాలు మాత్రం ఓవైపు వ్యతిరేకితో ఓట్లు అంటూనే మరోవైపున వైసిపి ప్రభుత్వం చేసిన మంచి పనులే తమను గెలిపిస్తాయని వైసిపి అభ్యర్థి తమ్మినేని సీతారాం ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఏదిఏమైనా ఆమదాలవలస నియోజకవర్గానికి సంబంధించి గెలుపుపై అన్ని పార్టీల నేతలతో పాటు ఓటర్లు కూడా ఎంతో ఆసక్తి కనబరుస్తున్నారు. ఈ ఉత్కంఠకు తెర తొలగిపోవాలంటే జూన్ 4 వరకు వేచి చూడాల్సిందే.

భూసార పరీక్షలు తప్పనిసరి

మట్టి నమూనాలు సేకరిస్తున్న కిషోర్ తదితరులు

ప్రజాశక్తి- ఆమదాలవలస

రైతులు నేలలో లభ్యమయ్యే పోషకాలపై అవగాహన పెంచుకోవడం వలన ఏ నేలలో ఏ పంట వేస్తే మంచి దిగుబడులు వస్తాయో తెలుసుకుని పంటలు వేయడం వలన ఆశించిన దిగుబడులు సాధించవచ్చని భూ పరీక్ష కేంద్రం ప్రోగ్రాం అసిస్టెంట్ ఆర్.కిషోర్ అన్నారు. శుక్రవారం సరుబుజ్జిలి మండలంలోని ఇసకలపాలెంకు చెందిన కొబగాపు వెంకినాయుడు పొలంలో భూసార పరీక్షలు కోసం మట్టి నమూనా సేకరణ విధానాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోతాదుకు మించి రసాయన ఎరువులు వాడడం, పంట వ్యర్థాలను కాల్చడం వలన నేలకు అవసరమైన సూక్ష్మజీవులు చనిపోయి, నేల సారవంతం కోల్పోయి కాలుష్యానికి గురవుతుందని ఆవేదన వ్యక్తం చేసారు. భూసార పరీక్షలతో నేలలో లభ్యమయ్యే పోషకాలతో పాటు చౌడు గుణాలు, ఎక్కువ సున్నం కలిగిన గుణాలను కూడా తెలుసుకుని తద్వారా ఎరువుల యాజమాన్య పద్ధతులు చేపట్టడం వలన పంటలపై పెట్టే పెట్టుబడి ఖర్చులు తగ్గించుకోవచ్చని రైతులకు సూచించారు. డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ జిల్లా ఏరియా మేనేజర్ పి.తవిటినాయుడు మాట్లాడుతూ గతేడాది జిల్లాలో 13 మండలాల్లో సుమారు రెండు వేల ఎకరాల్లో మట్టి నమూనాలు సేకరించి హైదరాబాద్‌లోని అంతర్జాతీయ మెట్ట ప్రాంత పంటల పరిశోధనా సంస్థ (ఇక్రిశాట్)లో పరిశీలన చేపట్టి సంబంధిత కార్డులను ఉచితంగా రైతులకు అందించడం జరిగిందన్నారు. తమ సంస్థ ఆధ్వర్యంలో ఈ ఏడాది సుమారు 50 వేల ఎకరాల్లో మట్టి నమూనాలు సేకరించి పరీక్షించడానికి ప్రణాళికలు సిద్ధం చేసి, ఆ దిశగా నిరంతరం కృషి చేస్తున్నామన్నారు. సుమారు 13 రకాల లభ్య పోషకాల స్థాయిని పరీక్షించి, తదుపరి పంటకు ఎరువుల యాజమాన్య పద్ధతులతో కూడిన భూసార పరీక్షా కార్డును కేవలం వంద రూపాయలకే రైతులకు అందించడానికి సిద్ధంగా ఉన్నామని, జిల్లాలోని రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ సమన్వయకర్త కె.ధర్మారావు, రైతులు పాల్గొన్నారు.

మజ్జిగ పంపిణీ చేస్తున్న వాకర్స్

మజ్జిగ పంపిణీ

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

వేసవి తీవ్రతను దృష్టిలో ఉంచుకుని పాదచారులు, వివిధ అవసరాల కోసం నగరానికి వచ్చి వెళ్లే వారు సేద తీరేందుకు వీలుగా నగరంలోని ఆర్ట్స్ కళాశాలలో స్టార్ వాకర్స్ ఆధ్వర్యాన మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. దాతల సహకారంతో చేపడుతున్న ఈ కార్యక్రమంలో శుక్రవారం వ్యవస్థాపక అధ్యక్షులు ఇందిరా ప్రసాద్ హాజరై మాట్లాడారు. రోజురోజుకూ ఎండతీవ్రత పెరుగుతోందని, ఇటువంటి సమయంలో మిట్ట మధ్యాహ్నం సమయంలో అత్యవసర పరిస్థితుల్లో తప్ప బయటకు రావద్దని సూచించారు. ఎండలో బయటకు రావాల్సి వస్తే ఆసమయంలో దాహార్తిని తీర్చుకునేందుకు తప్పక మజ్జిగ తాగాలని సూచించారు. అందులో భాగంగా 60 రోజుల పాటు ఆర్ట్స్ కళాశాల ఆవరణలో మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు తెలిపారు. వాకర్స్ ప్రతినిధులు బి.దేవి ప్రసాద్, క్లబ్ కో-ఆర్డినేటర్ ఎస్.జోగినాయుడు, ఉమా మహేశ్వరరావు, ఎం.మల్లిబాబు, సంతోష్ పాల్గొన్నారు.

శాంతికి ప్రతీక గౌతమ బుద్ధుడు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

మనిషి జీవన విధానాన్ని నిర్దేశించిన శాంతి ప్రబోధకుడు గౌతమ బుద్ధుడని వక్తలు పేర్కొన్నారు. నగరంలోని స్వాతంత్ర సమరయోధుల స్మృతివనంలో బుద్ధ జయంతి సందర్భంగా గౌతమబుద్ధుడు విగ్రహానికి విగ్రహ దాతలు డాక్టర్ పి.ఎల్.ఎన్.కృష్ణంరాజుతో పాటు వైద్యులు డాక్టర్ సింధూర, డాక్టర్ అరవింద్, డాక్టర్ బొడ్డేపల్లి సురేష్, ప్రొఫెసర్ విష్ణుమూర్తి పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మనిషి మనసుని అదుపు చేసుకోవడంతో పాటు వాంఛలను అధిగమించడం ద్వారా పరిపూర్ణత సాధిస్తాడన్నారు. ప్రపంచానికి జీవన మార్గాన్ని గౌతమ బుద్ధుడు నిర్దేశించారన్నారు. అవదాన పండితులు హరినాథరావు మాస్టారు బుద్ధుడు గొప్పతనంపై పద్యం ఆలపించారు. కార్యక్రమంలో నిర్వాహకులు మెట్ట అనంతం భట్లు, వర్మ, నక్క శంకరరావు, అప్పారావు పాల్గొన్నారు.

వేసవి వినోదంలో పాల్గొన్న విద్యార్థులు

ఆడవరంలో వేసవి వినోదం

శ్రీకాకుళం అర్బన్: గార మండలం ఆడవరం ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు భోగెల ఉమా మహేశ్వరరావు ఆధ్వర్యాన 'వేసవి వినోదం' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. వేసవి సెలవుల్లో ప్రతిరోజు ఉదయం గంటపాటు విద్యార్థులకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తూ చైతన్యం నింపుతున్నారు. కథలు చదివించడం, రాయించడం, పద్యాలు నేర్పించడం, ఎక్కాలు నేర్పించడం, ముందు తరగతుల పాఠ్యాంశాలను చదివించడం, డాన్స్ నేర్పించడం, జానపద, దేశభక్తి గేయాలు విద్యార్థులు నేర్చుకుంటున్నారు. ఉపాధ్యాయులు పాపారావు, విద్యార్థులు, తల్లిదండ్రులు భాగస్వాములవు తున్నారు.

ఆకట్టుకున్న కోలాటం

శ్రీకాకుళం అర్బన్: నగరంలోని కాకివీధిలో నిర్వహిస్తున్న ముత్యా లమ్మ తల్లి ఉత్సవాల్లో భాగంగా శ్రీరాగ శ్రీనివాస కోలాట బృందం ప్రదర్శించిన కోలాటం పలు వురిని ఆకట్టుకుంది. శుక్రవారం ఉత్సవాల్లో ప్రధాన ఘట్టమైన ఊరేగింపులో చేపట్టిన సాంస్కృతిక కార్యక్రమాల్లో కోలా టం నిర్వహించారు. శ్రీరాగ శ్రీనివాస కోలాట బృందం వ్యవస్థాపకులు లింగం గిరిజా శేషు ఆధ్వర్యాన 30 మంది మహిళలు, చిన్నారులు కోలాటం ప్రదర్శించారు.

తల్లిదండ్రుల సేవే జీవిత పరమార్థం

ధ్రువపత్రాలు అందిస్తున్న ప్రసూన్‌కుమార్ పండా, స్వామినాయుడు

ప్రజాశక్తి- శ్రీకాకుళం రూరల్

తల్లిదండ్రులకు చేసే సేవజీవిత పరమార్థమని గురజాడ విద్యాసంస్థల అధినేత జీవి స్వామినాయుడు అన్నారు. మండలంలోని మునసబుపేట గురజాడ విద్యాసంస్థల్లో ఎన్‌సిసి వార్షిక శిబిరం పది రోజులుగాలో జరుగుతుంది. చివరిరోజు శుక్రవారం గురజాడ విద్యాసంస్థల అధినేత జివి స్వామినాయుడు, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పులఖందం శ్రీనివాసరావు, సుబేదార్ మేజర్ సుభాష్ చంద్ హాజరయ్యారు. డ్రిల్, శిబిర నిర్మాణం, ఆయుధ ప్రయోగం, లైన్ ఏరియా ఏర్పాటు, వ్యాసరచన, చిత్ర. లేఖనం, వక్తృత్వ పోటీలు, సాంస్కృతిక విభాగాల్లో ప్రతిభ కనబరిచిన ఎన్‌సిసి క్యాడెట్లుకు ధ్రువపత్రాలను కమాండింగ్ ఆఫీసర్ 14 ఆంధ్ర బెటాలియన్ డాక్టర్ కల్నల్ ప్రశూన్ కుమార్ పండా, స్వామి నాయుడు అందించారు. ఈ సందర్భంగా స్వామి నాయుడు కళాశాలలో ఏర్పాటు చేసిన శిబిరంలో జరిగిన వివిధ కార్యక్రమాలను ప్రశంసించారు. మిలటరీ క్రమశిక్షణతో పౌరులు ఉన్నత స్థాయికి చేరుకుంటారన్నారు. శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల్లో ప్రతి కళాశాలలో, పాఠశాలలో ఎన్‌సిసి విభాగాలు ఏర్పాటు చేస్తే విద్యార్థులు మంచి వ్యక్తిత్వం పొందగలరన్నారు. డాక్టర్ ప్రసాద్ కుమార్ పండా మాట్లాడుతూ క్యాడెట్లుకు ఈ శిబిరంలో మిలిటరీ శిక్షణ, భవిష్యత్‌లో ఉత్తమ పౌరులుగా మారడానికి కావాల్సిన శిక్షణను అందించామన్నారు. అత్యవసర పరిస్థితుల్లో బాధ్యతాయుతంగా ఎలా స్పందించాలో, ప్రజలకు, దేశానికి ఎటువంటి సేవలు అందించాలన్న విషయంపై విద్యార్థులకు శిక్షణ ఇచ్చామన్నారు. కార్యక్రమంలో శిబిరం డిప్యూటీ క్యాంప్ కమాండెంట్ మేజర్ వంగ మహేష్, కెప్టెన్ పోలినాయుడు, లెఫ్టినెంట్ కె.రవికుమార్, సెకండ్ ఆఫీసర్లు దంత లక్ష్మణరావు, శరత్ కుమా, థర్డ్ ఆఫీసర్ హరికృష్ణ, కేర్ టేకర్ కేశవ నాయుడు, సుబేదార్ డల్వీర్ సింగ్, కళాశాల పూర్వ విద్యార్థులు చరణ్, తేజస్విని, హారతి పాల్గొన్నారు.

తూతూమంత్రంగా మండల సమావేశం

అధికారులను నిలదీస్తున్న సర్పంచ్ అప్పలనాయుడు

ప్రజాశక్తి- జి.సిగడాం

స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం శుక్రవారం ఎంపిడిఒ కె.వెంకన్నబాబు ఆధ్వర్యంలో ఎంపిపి మీసాల సత్యవతి అధ్యక్షతన నిర్వహించారు. ఇందులో భాగంగా పలువురు మండల స్థాయి అధికారులు అభివృద్ధి నివేదికలు వివరించారు. అనంతరం జెడ్‌పిటిసి కాయల రమణ మాట్లాడుతూ ప్రజల సమస్యలపై చర్చ, పరిష్కారాలకు వేదికైన మండల పరిషత్ సమావేశానికి అధికారులు విధిగా హాజరుకావాలని సూచించారు. ఉపాధి పనులు అరకొరగా సాగుతున్నాయని దేవరవలస, మదపాం సర్పంచ్‌లు ఎపిఒపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏడాదిన్నర నుంచి గౌరవ వేతనంపై జాడ, డిఆర్‌వలస ఎంపిటిసిలు మండల అధికారులను, ప్రజా ప్రతినిధులను నిలదీసారు. మండల ఆరోగ్య డాక్టర్లు, గ్రామ ఎంఎల్‌హెచ్‌పిలు కలిసి పెద్ద గ్రామాలే కాకుండా చిన్న చిన్న గ్రామల్లో ఉన్నటువంటి ప్రజలకు కూడా ఆ గ్రామాల్లో ఆరోగ్య శిబిరాలు ఏర్పాటు చేయాలని సర్పంచ్ వడిశ మహేష్ వైద్యులకు సూచించారు. కార్యక్రమంలో మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితుడు మీసాల వెంకటరమణ, వైస్ ఎంపిపి తోలేటి వెంకటరావు, సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, అధికారులు పాల్గొన్నారు.

పాతపట్నం : వివరాలు సేకరిస్తున్న పోలీసులు

గ్రామాల్లో కార్డాన్‌సెర్చ్

ప్రజాశక్తి- ఆమదాలవలస

సరుబుజ్జిలి మండలంలో అమృతలింగానగరం గ్రామంలో ఎస్ఐ బి.నిహార్ ఆధ్వర్యంలో శుక్రవారం తెల్లవారు జామున కార్డాన్ సెర్చ్ నిర్వహించారు. గ్రామంలోని రైతుల పంట పొలాల్లో, వివిధ ప్రాంతాల్లో ఉన్న గడ్డివాముల్లో అక్రమ మద్యం నిల్వలు, బాణాసంచా నిల్వలు ఉన్నట్లు అనుమానిస్తూ పోలీసులు గడ్డివాముల్లో తనిఖీలు నిర్వహించారు. అలాగే గ్రామంలో ద్విచక్ర వాహనాలను తనిఖీ చేసి ఎటువంటి పత్రాలు లేని మూడు ద్విచక్ర వాహనాలను సీజ్ చేసినట్లు ఎస్ఐ నిహార్ తెలిపారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఎన్నికల ఫలితాలు రోజున ఎటువంటి బాణాసంచా కాల్చరాదని, ఎన్నికల సంఘం ఆదేశాలను ఎవరైనా బేఖాతరు చేస్తే కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఎస్ఐ ప్రజలకు అవగాహన కల్పించారు.

పాతపట్నం: మండలంలోని బూరగాంలో శుక్రవారం పాతపట్నం, మెళియాపుట్టి ఎస్ఐలు మహమ్మద్ యాసిన్, రాజేష్‌ల సమక్షంలో పోలీసు సిబ్బంది శుక్రవారం కార్డాన్‌సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి వివరాలు సేకరించారు. అపరిచిత వ్యక్తులు ఎవరు కనిపించినా పోలీసులకు సమాచారం ఇవ్వాలని అన్నారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆదివాసీల హక్కులకు పోరాడుదాం

టెక్కలి: జిల్లాలోని ఆదివాసీల హక్కుల కోసం పోరాడుతామని సిపిఐ ఎంఎల్ న్యూ డెమొక్రసీ జిల్లా కార్యదర్శి వంకల మాదవరావు అన్నారు. మండలంలోని ముఖలింగాపురంలో శుక్రవారం పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లా విభజన తర్వాత జిల్లాలో ఐటిడిఎ లేకపోవడం బాధాకరమన్నారు. ఆదివాసీలకు ఐటిడిఎ కేటాయించడంలో ప్రభుత్వం ఘోరంగా విఫలం చెందిందన్నారు. ఇప్పటివరకు ఒక్క ఆదివాసీ గ్రామం కూడా ఐదో షెడ్యూల్‌లో చేర్చకపోవడం విచారకరమన్నారు. పోడు భూములకు పట్టాలివ్వడం పూర్తిస్థాయిలో జరగలేదన్నారు. గిరిజనులకు సరిపడా విత్తనాలు, ఎరువులు ప్రభుత్వం ఉచితంగా సరఫరా చేయాలన్నారు. గిరిజనుల సంక్షేమానికి జిసిసిలు ఉన్నప్పటికీ అటవీ ఉత్పత్తులకు గిట్టుబాటుదర కల్పించ లేదన్నారు. సమావేశంలో భారత్ కార్మిక సంఘాల సమైక్య జిల్లా కన్వీనర్ జుత్తు వీరాస్వామి, అరుణోదయ సాంస్కృతిక సమైక్య జిల్లా కార్యదర్శి సోమేశ్వరరావు, సుహాసినీ, ఈశ్వరరావు, శ్రీనివాస్. దమయంతి పాల్గొన్నారు.



రాళ్లు తేలిపోతున్న మేఘవరం రోడ్డు

ఈ రోడ్డుకు మోక్షం ఎప్పుడో?

సంతబొమ్మాళి: మండలంలోని నాగవరం పంచాయతీ మేఘవరం నుంచి సూరాడవాని పేట, టెంకూరుకు వెళ్లే రోడ్డుకు మెక్ష మెప్పుడోనని గ్రామస్తులు ఎదురు చూస్తున్నారు. టెంకూరు నుంచి సూరాడవానిపేటకు వెళ్లే రహదారి కొంతమేరకు సిసి రోడ్డు వేసి వదిలివేశారు. మిగతా రోడ్డు బండాల కూడలి నుంచి మేఘవరం వెళ్లే వరకు వెట్ మెటల్ వేసి ఏడాది అవుతుంది. ఉపాధి హామీ నిధులు రూ.65 లక్షలు మంజూరైనట్లు అధికారులు చెబుతున్నారు. సగం పనులు పూర్తయిన తరువాత కాంట్రాక్టర్‌కు బిల్లులు మంజూరు కాకపోవడంతో పనులు నిలిచిపోయాయి. దీంతో మరువాడ పంచాయతీలో ఎం.మరువాడ, డి.మరువాడ, సి.మరువాడ, చొక్కర వానిపేట, మేఘవరం పంచాయతీలో సూరాడ వానిపేట, టెంకూరు వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. టెక్కలి, నౌపడ ఇతర ప్రాంతాలకు వెళ్లాలంటే ఈ రహదారే ఆధారం. ప్రధాన రహదారిపై రాళ్లు తేలిపోవడంతో వాహన దారులు బాటచారులు ప్రయాణం చేయాలంటే అవస్థలు పడుతున్నారు. వర్షం వచ్చిందంటే చాలు ఈ రహదారిపై ఏర్పడిన గోతుల్లో నీరు చేరిపోవడంతో అవస్థలు వర్ణనాతీతం. ఇప్పటికైనా ఉన్నతాధికారులు ప్రజా ప్రతినిధులు స్పందించి మిగిలి ఉన్న రోడ్డును సిసి రోడ్డుగా నిర్మాణం చేపట్టాలని కోరుతున్నారు.

మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ రామారావు

యువకుడు ఆత్మహత్య

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

మండలంలోని అనంతగిరి పంచాయతీ వెంకటాపురం జీడి తోటల్లో శుక్రవారం గొర్లె ఉమా మహేశ్వరరావు (28) జీడి చెట్టుకు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానికుల ద్వారా సమాచారం తెలుసుకున్న ఎస్ఐ సిహెచ్.రామారావు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మృతుడు ఉమామహేశ్వరరావు విశాఖపట్నంలోని నావల్ డాక్ యార్డులో కూలీగా పనిచేస్తున్నట్టు సంఘటన స్థలంలో దొరికిన గుర్తింపు కార్డు బట్టి తెలిసింది. గురువారం రాత్రి తోటలోని జీడి చెట్టుకు ఉరి వేసుకున్నట్లు ఆనవాలు బట్టి పోలీసులు అనుమానిస్తున్నారు. మృతుడు ఎరుపు చారలతో ఉన్న తెలుపు టీ షర్టు, నలుపు నిక్కరు ధరించాడు. మృతదేహాన్ని పలాస ప్రభుత్వాస్పత్రి మార్చురీకి తరలించారు. గుర్తింపు కార్డు తప్ప మరి ఏ ఇతర ఆధారాలు లభ్యం కాకలేదు. మరిన్ని వివరాలు కోసం నావల్ డాక్ యార్డును సంప్రదిస్తున్నమని ఎస్ఐ తెలిపారు. మృతదేహాన్ని గుర్తించి బంధువులు, కుటుంబ సభ్యులు పోలీసులను సంప్రదించాలన్నారు. స్థానిక విఆర్ఒ రెయ్యమ్మ ఇచ్చిన ఫిర్యాదుమేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

సైనిక లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహిస్తున్న పోలీసులు

అనారోగ్యంతో సిఆర్‌పిఎఫ్ జవాన్ మృతి

ప్రజాశక్తి- ఆమదాలవలస

మండలంలోని కొర్లకోటకు చెందిన సిఆర్‌పిఎఫ్ జవాన్ పేడాడ రాజగోపాలరావు (29) అనారోగ్యంతో మృతి చెందారు. హైదరాబాద్ సిఆర్‌పిఎఫ్ బెటాలియన్‌లో విధులు నిర్వహిస్తున్న రాజగోపాలరావు గురువారం హైదరాబాద్‌లో మరణించారు. ఆయన స్వగ్రామమైన కొర్లకోట గ్రామానికి శుక్రవారం సిఆర్‌పిఎఫ్ అధికారులు ప్రత్యేక వాహనంలో పార్థివ దేహాన్ని తీసుకొచ్చి కుటుంబ సభ్యులకు అప్పగించారు. స్థానిక ఎస్ఐ కె.వెంకటేష్ ఆధ్వర్యంలో పోలీసులు సిఆర్‌పిఎఫ్ బలగాలు జవాన్ మృతదేహానికి సైనిక లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. అంత్యక్రియల ఖర్చుల నిమిత్తం రూ.50వేలు మృతుని భార్య చాందినికి పోలీసుల అందించారు. భార్యతో పాటు ఆయనకు నాలుగేళ్ల కుమార్తె కలదు. కార్యక్రమంలో ఎంపిటిసి అన్నెపు భాస్కరరావు, సర్పంచ్ ప్రతినిధి సనపల అప్పలనాయుడు, గ్రామస్తులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఉత్తమ విద్యార్థులకు ఉచిత విద్య

రణస్థలం రూరల్: 2024 - 25 విద్యా సంవత్సరానికి సంబంధించి 5, 6, 7 తరగతుల్లో ఉచితంగా చేరే విద్యార్థులకు వచ్చే జూన్ నెల రెండో తేదీన ప్రవేశ పరీక్ష నిర్వహిస్తు న్నామని ఐరిస్ సకల్య స్కూల్ డైరెక్టర్ కొమనాపల్లి హరికృష్ణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉత్తమ ప్రతిభ కనబర్చి మొదటి ఐదు స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు పదో తరగతి వరకు ఉచితంగా పుస్తకాలు, యూనిఫాం, విద్యను అందిస్తామని చెప్పారు. మరో ఐదుగురుకి రూ.5వేలు స్కాలర్ ఇస్తామన్నారు. అసక్తి గల విద్యార్థులు ఈ నెల 31లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు కొండములగాం సమీపంలోని ఐరిస్ పాఠశాలను సందర్శించాలన్నారు.

ఇంటర్ పరీక్షకు 256 మంది గైర్హాజరు

శ్రీకాకుళం అర్బన్: జిల్లాలో ఇంటర్మీడియట్ సప్లమెంటరీ పరీక్షలు శుక్రవారం ఆరంభమయ్యాయి. తొలిరోజు పరీక్షకు 256 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. జిల్లా వ్యాప్తంగా ఉదయం పూట బెటర్ మెంట్‌కు 3,422 మంది దరకాస్తు చేసుకోగా, వారిలో 3,246 మంది పరీక్ష రాశారు. వారిలో 176 మంది గైర్హాజరయ్యారు. అలాగే రెండో పూట పరీక్షకు 926 మందికి గాను 846 మంది హాజరు కాగా, 80 మంది గైర్హాజరయ్యారని ఆర్ఐఒ తెలిపారు.

గ్రామ సంఘాలకు ఎ-గ్రేడ్ తప్పనిసరి

కవిటి: మండలంలోని అన్ని గ్రామ సంఘాలు తప్పనిసరిగా ఎ-గ్రేడ్‌లో ఉండాలని ఎపిఎం గోవిందరావు అన్నారు. మహిళా సమాఖ్య భవనంలో మండలంలోని గ్రామ సంఘాల విఒఎలకు రెండు రోజుల శిక్షణా కార్యక్రమం శుక్రవారంతో ముగిసింది. ఈ సందర్భం గా మాట్లాడుతూ సిఐఎఫ్, స్త్రీనిధి, ఉన్నతి రికవరీ తక్కువ ఉన్న గ్రామ సంఘాలు కచ్చితంగా వంద శాతం రికవరీ చేయాలని సూచించారు. అలాగే చిన్న సంఘాలకూ మొబైల్ బుక్ కీపింగ్ ద్వారా పూర్తిస్థాయిలో ఆర్థిక లావాదేవీలు నిర్వహించాలని సూచించారు. ముఖ్యంగా తమ పరిధిలో 15 గ్రామ సంఘాలు వెనుకబడి ఉన్నాయని, వాటి నిర్వహణ, వసూలు కోసం ప్రత్యేక బృందం నియమించినట్టు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా కవిటి మంచి స్థానంలో ఉన్నప్పటికీ మొదటి స్థానమే లక్ష్యంగా విఒఎలు పని చేయాలని సూచించారు. ఎంఎంఎస్ అధ్యక్షులు జె.కమలమ్మ, కోశాధికారి హైమావతి, స్రీనిధి మేనేజర్ కె.రాము, సిసి రామకృష్ణ, డి.ద్రాక్ష, సిబ్బంది పూడి సుహాసిని, కుసుమకుమారి పాల్గొన్నారు.

రుద్రమూర్తికి విశిష్ట కళా సేవా పురస్కారం

వజ్రపుకొత్తూరు: ప్రవాసాంధ్ర ప్రజా నాట్యమండలి అధ్యక్షుడు లండ రుద్రమూర్తికి విశిష్ట కళాసేవా పురస్కారం లభించింది. ఎపి నాటక పరిషత్ కమిటీ అధ్యక్షుడు బొద్దాల వెంకట రామారావు అధ్యక్షతన బివిఆర్ కళా కేంద్రం ఆధ్వర్యాన తాడేపల్లిగూడెం బివిఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో జాతీయ స్థాయి నాటిక పోటీలు శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రుద్రమూర్తికి అవార్డుతో సన్మానించారు. రుద్రమూర్తి భిలాయికి చెందిన రంగ భూమి, వెండితెర కళాకారుడు, రచయిత, దర్శకుడు, భిలాయి నట సమాఖ్య అధ్యక్షుడు, ప్రవాసాంధ్ర ప్రజా నాట్య మండలి అధ్యక్షుడుగా సేవలు అందిస్తున్నారు. రుద్రమూర్తి వజ్రపుకొత్తూరు మండలానికి చెందిన వ్యక్తి కావడంతో పలువురు అభినందనలు తెలిపారు. దండకారణ్యం సినీ ఫేం అవార్డు గ్రహీత రుద్రమూర్తి సన్మానంపై ప్రవాసాంధ్ర ప్రజానాట్య మండలి సీనియర్ ఉపాధ్యక్షుడు కొండప్ప వెంకటరావు, ప్రధాన కార్యదర్శి సిహెచ్.శ్రీనివాస్, భిలాయి తెలుగు సమాజ్ అధ్యక్షుడు జోగారావు, భిలాయి మత్స్యకార సామాజిక సంస్థ ప్రధాన కార్యదర్శి భాస్కరరావు హర్షం వ్యక్తం చేశారు.